క్లుప్తంగా

పీఎం సభకు తరలివెళ్లిన బీజేపీ కార్యకర్తలు



గుంటూరు మెడికల్: అమరావతి పనుల పునః ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు తూర్పు నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు, బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో కొత్తపేట శివాలయం దగ్గర భారీ జన సమీకరణతో శుక్రవారం అమరావతి సభకు తరలి వెళ్లారు. శంకుస్థాపనకు వస్తున్న ప్రతి కార్యకర్త, అభిమానులకు ఎలాంటి ఇబ్బంది పడకూడదని ఏర్పాట్లు చేశారు. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సురేష్ కుమార్ జైన్, కార్పొరేటర్ సమతా, పవన్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం నేడు

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో శనివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ కమిటీ వితరణతో రూ.1.60 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వెంటిలేటర్‌లను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఆస్పత్రి అభివృద్ధి కోసం మంత్రి చేతుల మీదుగా రూ.9 లక్షల చెక్కు అందజేయనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో భాష్యం పేరమ్మ చారిటబుల్ ట్రస్టు, భారత్ ఫార్మా అండ్ మెడికల్ ఆక్సిజన్స్ సహకారంతో రూ.22 లక్షలతో నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సభ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శివాలయంలో శుక్రవారం జగద్గురువు ఆదిశంకరాచార్యుల వారి జయంతి నిర్వహించారు. గర్తపురి హరిహర స్మరణ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రవార అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రదక్షిణలు, గణపతి పూజ, సాయంత్రం వేదస్వస్తి చేపట్టారు. పుష్పగిరి సంస్థానానికి చెందిన శ్రీ నృసింహ భారతీస్వామి హాజరై అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పన్నాల బుచ్చిరామ శాస్త్రి, ఈఓ కోటేశ్వర రావు, న్యాయవాది గుండు జ్ఞానేశ్వర్, సభ్యులు తిరుపతి చెన్నయ్య, గుండెపూడి భానుమూర్తి, అవ్వారి భీముడు, శనగవరపు చంద్రశేఖర్, సంగాపు బాల చంద్రశేఖర్, సంగాపు హేమచంద్ర బాబు, చింతపల్లినరసింహారావు పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో మహిళ ఆత్మహత్య



లక్ష్మీపురం: వేధింపులు భరించలేక ఓ వివాహిత అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణానగర్ జీరో లైన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన మువ్వల మల్లికార్జున రావు అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు మగ, ఆడ సంతానం ఉన్నారు. కుమార్తె మేఘనా(24)ను అద్దంకి ప్రాంతానికి చెందిన కొత్తమాసు మణిక్రాంత్ అనే యువకుడికి ఇచ్చి 2023 ఫిబ్రవరి 12వ తేదీన పెళ్లి చేశారు. వీరికి ఏడాది పాప ఉంది. అయితే వివాహం అయినప్పటి నుంచి మేఘనా, భర్త మణిక్రాంత్‌ల మనస్పర్థలు పెరిగిపోయాయి. మేఘనాను నిత్యం కట్నం తీసుకు రావాలంటూ వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భర్తను వదిలేసి సుమారు నెల రోజుల క్రితం గుంటూరు కృష్ణానగర్‌లోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. అయితే గురువారం కాపురం గురించి పెద్దల సమక్షంలో ఇరు కుటుంబాలు మాట్లాడుకునే క్రమంలో ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మేఘనా మనస్తాపానికి గురై శుక్రవారం కృష్ణానగర్ జీరో లైన్‌లో ఉన్న హరి టవర్స్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్ఐ తరంగిణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భర్త మణిక్రాంత్‌ను పట్టాభిపురం పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్‌కు వేసవి షాక్..!

- లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ప్రమాదం
- షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం
- జాగ్రత్తలు ఎంతో అవసరం



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద తెగిపడిన ఎక్స్‌టెన్షన్ విద్యుత్ తీగ (ఫైల్)

పట్నంబజారు: భగ భగ మండే సూర్యుడు తన ప్రచండ రూపాన్ని చూపెడుతున్నాడు. కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రజల ఎండ తీవ్రతను తట్టుకునేందుకు.. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవటం పరిపాటే. ఈ క్రమంలో వైరింగ్‌లో ఏవైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచిఉంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గత కొద్ది రోజుల క్రితం వేసవి కాలం ప్రారంభంలోనే అధిక విద్యుత్ వినియోగంతోనే.. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం బయట నేరుగా ఎక్స్‌టెన్షన్ విద్యుత్ తీగ తెగిపడింది. పక్కనే ఉన్న చెట్టు తగలబడింది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. పాత గుంటూరులోని ఒక నివాసంలో గత కొద్ది రోజుల క్రితం ఒకే నివాసంలో రెండు ఏసీలు వినియోగిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఫ్యూజులు పోయాయి. దీంతో స్వల్పంగా మంటలు రావటంతో.. ఆ ఇంటి యజమాని ఫ్యూజులు తీసేసి, విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించాడు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం అయ్యే అవకాశాలు లేకపోలేదు.

అధికలోడుతో అనర్థమే

వేసవిలో విద్యుత్ ఉపకరణాల అధిక వినియోగంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. నివాసమైనా, కార్యాలయమైనా ఆ ప్రాంత విద్యుత్ వినియోగాన్ని బట్టి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఉంటుంది. ఎవరైనా వినియోగదారుడు కేవలం ఒక కేవీ లోడుకు మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం ఆ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడే అవకాశాలు లేకపోలేదు. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా వినియోగించే క్రమంలో విద్యుత్ హెచ్చు తగ్గులు లేకుండా ఉండేందుకు స్టెబిలైజర్ల వినియోగం మంచిది. గృహాలలో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ విద్యుత్‌ను వినియోగించటం, ఒకే స్విచ్ బోర్డుకు అధిక ప్లగ్ పెట్టడం ద్వారా విద్యుత్‌పై పెనుభారం పడుతుంది. రక్షణ పరికరాలైన ఎంసీబీ(మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి కాలంలో నివాసంలో విద్యుత్ పరికరాలు, వైర్‌లను ఎలక్ట్రీషియన్‌ల ద్వారా పరిశీలించుకోవటం ఎంతో మంచిది. ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి. గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.

అప్రమత్తత అవసరం

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ. తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. దీనితో పాటు ఇటీవల కాలంలో ఈదురుగాలులు అధికంగా వీస్తున్న క్రమంలో ఫ్లెక్సీలు, ఇతరత్రా బ్యానర్‌లు తీగలకు దూరంగా కట్టుకోవాలని సూచిస్తున్నాం. తద్వారా కొద్ది మేరకు సమస్యను అరికట్టగలం. ఆయా ప్రాంతాల్లో సమస్యలు వస్తే.. తక్షణమే ఆ ప్రాంత అధికారి, సిబ్బందికి తెలియజేయాలి.

– కేవీఎల్ఎన్ మూర్తి, ఏఈ, గుంటూరు

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై జేకేసీ కళాశాలలో సదస్సు

ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌పై జేకేసీ కళాశాలలో సదస్సు



మాట్లాడుతున్న కె. సాంబశివరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన సదస్సు శుక్రవారం ముగిసింది. విభిన్న పాఠ్య ప్రణాళికలతో కూడిన విద్యా బోధనకు, ప్రస్తుత వర్తమాన పరిశోధనాత్మక పరిస్థితులకు మధ్యగల వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు సదస్సు ఏర్పాటు చేసినట్లు కళాశాల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అధికారి ఆచార్య యలవర్తి సురేష్‌బాబు తెలిపారు. విద్యార్థులకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి పాటించాల్సిన సలహాలను జాగ్రత్తలను సూచనలను నిష్ణాతులైన వారితో అందించేలా ఈ సదస్సు దోహద పడిందని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, ప్రారంభోపన్యాసం చేయగా, ప్రిన్సిపాల్ ఆచార్య పరుచూరి గోపీచంద్ ముగింపు ప్రసంగం చేశారు. సదస్సులో కీలకోపన్యాసకులుగా హైదరాబాదుకు చెందిన శిక్షకులైన వికాస్ విద్యార్థినీ, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రస్తుత సమాజ అవసరాలకు తగినట్లుగా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో సోదాహరణంగా విశదీకరించారు. విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించేందుకు అవసరమైన మెళకువలను అందించేలా భవిష్యత్‌లో ఇలాంటి సదస్సులను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. సదస్సులో డిగ్రీ కంప్యూటర్ సైన్స్ కోర్సు విభాగాధిపతి వై.వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్య, రామానుజాచార్యుల జయంత్యుత్సవాలు



అష్టోత్తర శతనామావళి పారాయణ



మాట్లాడుతున్న జొన్నా నాగేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం శంకరాచార్యులు, రామానుజాచార్యుల జయంత్యుత్సవాలు జరిగాయి. స్వామి వార్లకు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులతో దేవాలయ పాలక మండలి నిర్వహించింది. అన్నమయ్య కళావేదికపై సత్సంగ సభ్యులతో అష్టోత్తర శతనామావళిః పారాయణం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టగా, తోట నరసింహారావు సౌజన్యంతో జొన్నా శివనాగేశ్వరరావు సుందరకాండ పారాయణం నిర్వహించారు. వీరికి తబలపై ఎస్.వెంకట్, కీబోర్డుపై డి.రామకృష్ణ వాయిద్యాన్ని అందించారు.

తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్



మాట్లాడుతున్న పి.వెంకటేష్

తెనాలిటౌన్: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినప్పటికి ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బ్రిడ్జి కోర్సుల పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల తల్లి దండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేయించుకుంటున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు దోచుకోవడమే పనిగా ఇంటింటికీ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో ఉల్లాసంగా గడపాల్సిన విద్యార్థులు బ్రిడ్జి కోర్సుల పేరుతో పాఠశాలల్లో మగ్గుతున్నారని విమర్శించారు. జీవోనెం.77ను రద్దు చేసి అందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం హామీలను నేరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వేసవిలో జరుగుతున్న తరగతులను నిలుపుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జి.శివనాగరాజు, తెనాలి పట్టణ ఉపాధ్యక్షుడు భూమేష్, కోశాధికారి తేజ, సహాయ కార్యదర్శి దినేష్, నాయకులు అఖిల్, పండు, హేమంత్, సాయి, తదితరులు ఉన్నారు.

కారు అద్దం పగల గొట్టి రూ.40 వేలు చోరీ

లక్ష్మీపురం: పోస్టాఫీసులో ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి కారు వెనుక భాగం అద్దం పగల గొట్టి బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు చోరీ చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన గంధ్ర సునీత, భర్త శ్యామ్(లేటు) వీరికి ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. సునీత జేకేసీ కళాశాల వద్ద తను శ్రీ ఫ్యాషన్ పేరుతో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే గురువారం బ్రాడీపేటలోని పోస్టాఫీసులో ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు వచ్చిన సునీత కారును పార్కింగ్ చేసి పోస్టాఫీసులోకి వెళ్లింది. పని ముగించుకుని బయటకు వచ్చిచూసే సరికి కారు వెనుక భాగంలో ఉన్న అద్దం పగలగొట్టి బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. తక్షణమే అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఉపాధ్యాయుడు షేక్ ఖయ్యూం స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పిడంపై శిక్షణ ఇచ్చారు. వ్యక్తిత్వ వికాసంపై లావణ్య, రాజధానులపై వేదకృష్ణ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

బాలుడి అదృశ్యం



లక్ష్మీపురం: స్పీచ్ థెరపికి వెళ్లిన బాలుడి కోసం రోజు వచ్చే కారు డ్రైవర్ మారడంతో గుర్తించలేక పోవడంతో బాలుడు తప్పి పోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కొరిటిపాడు రామన్నపేటకు చెందిన బాసీద్, తల్లి ఆసీఫా కుమారుడు షేక్ అస్రార్. తండ్రి బాసీద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే చంద్రమౌళినగర్‌లో సంకల్పా స్కూల్‌లో ప్రతి రోజు స్పీచ్ థెరపికి కుమారుడు అస్రార్‌ను తీసుకెళ్తుంటాడు. రోజు కారు డ్రైవర్‌తీసుకు వచ్చి శిక్షణ పూర్తి అయిన వెంటనే తిరిగి తీసుకు వెళతాడు. అయితే శుక్రవారం రోజు వచ్చే కారు డ్రైవర్ రాక పోవడంతో కొత్త డ్రైవర్ రావడంతో అస్రార్ కారులో ఎక్కలేదు. దీంతో చంద్రమౌళినగర్ 3వ లైన్ నుంచి తప్పి పోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చుట్టు పక్కల పరిశీలించి ఎంతకు ఆచూకి తెలియక పోవడంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు 8688831614, ఎస్ఐ నరహరి 8688831343, 9000123005, 7889359521 లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

'రోటరీ' వీల్‌చైర్ల పంపిణీ



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన తొమ్మిదిమంది పిల్లలకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ సహకారంతో ఈ వితరణ చేశారు. రోటరీ, తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, రొటేరియన్లు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, కొత్తపల్లి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, ఈదర ఆనంద్, కుర్రా శ్రీనివాసరావు, జీవీ నారాయణ, కేవీ కృష్ణ, ఎన్.కిషోర్, జవ్వాజి శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీధర్, ఆలపాటి కిరణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలతోనే ప్రయోజనమన్న నాటికలు



'కిడ్నాప్' నాటికలో సన్నివేశం

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో శుక్రవారం రాత్రి ఆరంభమైన ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగాయి. తొలుత ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజెప్పిందీ నాటిక. స్వార్థజీవనానికి అలవాటు పడుతున్న యువత తల్లిదండ్రులను దూరంగా ఉంచుతున్న తీరును కళ్లకు కట్టారు. వందలకొద్దీ పుస్తకాలు చదివితే వచ్చే విజ్ఞానం, మన ఇళ్లలోని పెద్దవాళ్లు చెప్పే మాటలతోనే వస్తుందని పాత్రలతో చెప్పించారు. ప్రధాన పాత్రల్లో చెరుకూరి సాంబశివరావు, అమృతవర్షిణి, షేక్ హసన్, ఎస్.పూజిత, నడింపల్లి వెంకటేశ్వరరావు, లోకేష్ నటించారు. చెరుకూరి సాంబశివరావు రచించిన ఈ నాటిక ప్రదర్శనకు ఆయనే దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రుతువు లేని కాలం' నాటికను ప్రదర్శించారు. అగస్త్య రచించిన నాటికకు వైబీ చౌదరి దర్శకత్వం వహించారు. సమిష్టి కుటుంబాలపై చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో ద్వేషాన్ని చర్చించిందీ నాటిక. సోకులకీ, ఫ్యాషన్లకీ లొంగిపోయి, వాళ్లకి వాళ్లే బానిసలుగా మిగిలిపోతున్నారు. వార్ధక్యం పేరుతో పెద్దవాళ్లని దూరంగా వుంచుతున్నారు. అలాంటి జీవితాలను ఎంచుకోవటం ఎలా సబబు? వాళ్లకు మనుష్యుల మధ్య బంధాల విలువ ఎలా తెలుస్తుందనే అంశాన్ని ఉదాత్తంగా ప్రశ్నించిందీ నాటిక. కాలం రుతువుల్లో భద్రంగా ఉన్నట్టే మనిషి బంధాల మధ్య హాయిగా, రక్షణగా ఉంటుందనే సందేశాన్నిచ్చింది. ప్రధాన పాత్రల్లో వై.బుచ్చయ్య చౌదరి, కె.వీరయ్య, జి.సురేంద్రబాబు, సునయన, రత్నబాబు, సురభి ప్రభావతి, కె.శ్రీనివాసరావు తదిరులు నటించారు. చివరగా గురజాడ కళామందిర్ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శించారు. పేదరికాన్ని అధిగమించాలనే ఆలోచనతో అవగాహన లేని ప్రయాణం ప్రస్థానమై, మహాప్రస్థానమై చావుకి, ప్రయాణానికీ మధ్య గీతను చెరిపేస్తుందనే సత్యాన్ని చాటిందీ నాటిక. బొర్ర నరేస్, ఎల్ఎస్‌కేఆర్‌కే ప్రసాద్, ఈవన రమేష్‌బాబు, పిళ్లా నటరాజ్, ఆర్.రాజేశ్వరి నటించారు. ఎం.సంజీవి రచించిన నాటికను పిళ్లా నటరాజ్ దర్శకత్వంలో ప్రదర్శించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

అఖిల పక్ష నాయకులు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివాజీ

పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌ని రద్దు చేయాలని కోరుతూ మే 20న కార్మిక, కర్షక, ప్రజాసంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా శుక్రవారం పెదకాకాని సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలు కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. కష్టపడి ఉత్పత్తి చేసే కార్మికులకు,ఉద్యోగులకు పెద్దఎత్తున నష్టం జరిగే విధంగా చట్టాల్లో మార్పు చేశారని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించిన ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయట్లేదని, కార్మికులు 12 గంటలు పని చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత అమలు కావడం లేదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఎల్ఐసీ, పోస్టల్, రైల్వే ఓడరేవులు, పోర్టులు ప్రైవేటీకరణ చేశారని, 32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు లాంటి సంస్థలని ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉల్లంగుల శివయ్య, సీపీఐ నాయకులు దర్శి లింగారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గోపి సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో కిశోరి వికాసం కమిటీలు



వంగిపురంలో కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: కిశోరి బాలికల హక్కులు, సమస్యలపై అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లో 'కిశోరి వికాసం' కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో సీహెచ్. విజయనిర్మల తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం నుంచి కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రత్తిపాడు, వంగిపురం, కొండేపాడు, రామానగర్ కాలనీల్లోని అంగన్‌వాడీల్లో కిశోర బాలికల పరిచయ కార్యక్రమం ఆయా గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శిక్షణ లక్ష్యాలను నిర్దేశించుకోవడం, హక్కులు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాలను ఉద్దేశించి విజయనిర్మల మాట్లాడుతూ కమిటీకి కన్వీనర్‌గా మహిళా సంరక్షణ కార్యదర్శి, సభ్యులుగా అంగన్‌వాడీ కార్యకర్త, ఎంపీహెచ్‌ఈడబ్ల్యూ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వీవోలు ఉంటారని తెలిపారు. జూన్ పదవ తేదీ వరకు పన్నెండు రకాల అంశాలపై కిశోర బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పుస్తకం.. ఓ మంచి నేస్తం

ప్రత్తిపాడు: పుస్తకం విజ్ఞానాన్ని అందిస్తుంది. అగ్రపథాన నిలుపుతుంది. మనకు తెలియని విషయాన్ని తెలియజేస్తుంది. మాటలు మాట్లాడిస్తుంది. మౌనాన్ని తరిమేస్తుంది. అందుకే పుస్తకం.. ఓ మంచి నేస్తం. ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి. పుస్తకాన్ని చదవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. సమ్మర్ హాలీడేస్‌లో విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానాన్ని పొందవచ్చు.

జూన్ 6 వరకూ శిబిరం నిర్వహణ

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జూన్ 6వ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి పదకొండు గంటల వరకు జరగనున్నాయి. ఐదు సంవత్సరాల నుంచి పదిహేను సంవత్సరాలలోపు పిల్లలు హాజరు కావచ్చు.

పలు అంశాల్లో శిక్షణ

వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు, చిన్నారులతో పుస్తక పఠనం చేయిస్తారు. ఉదయం పది గంటల వరకు కథలు వినడం, పుస్తక పఠనం, చదివిన కథలు చెప్పిండం, చిత్రలేఖనం, కథనాలు, సృజనాత్మక కృత్యాలు చేయిస్తారు. పది నుంచి పదకొండు గంటల వరకు లూడో, చెస్, పేపర్ ఆర్ట్, క్యారమ్స్ వంటి ఆటల్లో శిక్షణ ఇస్తారు. పదిహేనేళ్ల లోపు చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సందర్శించి, పుస్తక పఠనంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు శిబిరాలు దోహదపడతాయి. సృజన్మాతక నైపుణ్యాలు సాధించేలా కృషి చేస్తారు.

సభకు మేము రాం..రాం !

గుంటూరు రూరల్: అమరావతిలో ప్రధాని సభకు ప్రతి మహిళ తప్పనిసరిగా రావాలని అధికారులు హుకుం జారీ చేశారు. రాని వారికి పథకాలు రావని, ప్రభుత్వం నుంచి అందే లబ్ధి చేకూరదని వాట్సప్‌లలో ఆర్‌పీలు వాయిస్ మెసేజ్‌లతో ప్రజల్ని భయకంపితులను చేశారు. డ్వాక్రా మహిళలైతే తప్పనిసరిగా రావాల్సిందేనని ఎమ్మెల్యే ఆదేశించారు. రాకపోతే రుణాలు నిలుపుదల చేస్తామని మహిళలను బెదించారు.అయినా మీటింగ్‌కు వెళ్లేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు నిరాకరించారు. అందుకు నిదర్శనమే ఆయా మండల కేంద్రాల్లో బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులే ఉదాహరణగా నిలిచాయి.

మండలానికి 100 బస్సులు

నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలను తరలించేందుకు మండలానికి 100 బస్సులను కేటాయించారు. ప్రతి గ్రామానికి నాలుగు నుంచి ఐదు బస్సులను ముందురోజు రాత్రే పంపారు. బిర్యానీలు, మందు, ఫ్రీగా ఇస్తామని చెప్పి ఊదరగొట్టారు. ప్రజలను తరలించేందుకు ఎమ్మెల్యే అనంతపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలనుంచి ఆర్‌టీసీ బస్సులను నియోజకవర్గంలోని మండల కేంద్రాలకు గురువారం ఉదయమే రప్పించారు. ప్రజలు తప్పనిసరిగా రావాలని, గ్రామాల్లోని కూటమి నేతలకు హుకుం జారీ చేశారు. జన సమీకరణ చేసే కార్యక్రమాలను గ్రామ స్థాయి, మండల స్థాయి నాయకులకు అప్పగించారు. గ్రామాల్లో తిరిగి కూటమి నాయకులు ప్రజలను మీటింగ్‌కు రావాల్సిందేనని ఆజ్ఞాపించారు. అయినా సభకు వెళ్లేందుకు నిరాకరించారు.

ఎర్రటి ఎండలో మాడిపోయిన సిబ్బంది

వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన బస్సుల డ్రైవర్‌లు, సిబ్బందికి కూటమి నేతలు కనీస వసతులు కల్పించకపోవటంతో బస్టాండ్‌లోనే ఎర్రటి ఎండలో మండిపోయారు. బస్సుల నీడలో చొక్కాలు విప్పుకుని సేద తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం వారికి భోజనం, తాగునీరు సైతం కల్పించకపోవడంతో ఆకలితో నకనకలాడారు. ఇదేమి కర్మ అనుకుంటూ ఆర్‌టీసీ సిబ్బంది తలలు బాదుకున్నారు.

బస్టాండ్‌లోనే 24 బస్సులు నిలిపివేత

నియోజకవర్గంలోని పెదనందిపాడు మండలానికి ఎమ్మెల్యే 64 బస్సులు కేటాయించారు. ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో బస్టాండ్‌లోనే 24 బస్సులను నిలిపివేశారు.